sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే

హైదరాబాద్ | 07-08-2026 శుక్రవారం | సంపుటి-02 సంచిక : 122 EDITOR: ROHINI



విస్కీలో వేస్ట్... రమ్ములో రస్ట్

ప్రముఖ లిక్కర్ బ్రాండ్ల బండారం బట్టబయలు

- ఫుడ్ సేఫ్టీ అధికారుల సంచలన దాడులు
- మందులో రుచి కోసం కృత్రిమ రంగులు
- బాటిళ్లలో కెమికల్ ఫ్లేవర్ మాయాజాలం
- నకిలీ టేస్టీ... సీసాలో వయసు గోల్‌మాల్



గ్లాసులో పోసే మందులో అసలు మత్తెంత, అందులో కల్తీ ఎంత అనే కోణంలో ఇప్పుడు దేశవ్యాప్తంగా కలకలం రేగుతోంది. తాగే వారి గొంతులోకి దిగేది అసలు సిసలైన సరుకా లేక రసాయనాల రసమా అనే దిగ్భ్రాంతికర నిజాలు ఒక్కటొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. నిత్యం కిక్కు కోసం కోట్లాది మంది నమ్ముతున్న కొన్ని ప్రముఖ బ్రాండ్ల వెనుక జరుగుతున్న నయా మోసాన్ని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా బట్టబయలు చేసింది. అసలు తయారీ లేకుండానే ఆర్టిఫిషియల్ ఫ్లేవర్లతో నడిపిస్తున్న వ్యాపారాన్ని కట్టడి చేసేందుకు రంగంలోకి దిగింది.

- సహనం వందే, హైదరాబాద్

కేంద్రం దేశంలోని పలు ప్రముఖ లిక్కర్ తయారీ కంపెనీలపై విరుచుకుపడింది. రుచిని కృత్రిమంగా సృష్టించి మోసం చేస్తున్నారనే ప్రధాన ఆరోపణలతో అమ్మకాలపై నిషేధపు ఉత్తర్వులు జారీ చేసింది. వినియోగదారులను మోసం చేస్తూ అసలు రుచిని మైమరిపిస్తున్న ఈ దందాను ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా తీవ్రంగా తప్పుపట్టింది. కాఫీ లేదా వెనిల్లా వంటి వాటిని వాడేందుకు చట్టపరంగా అనుమతి ఉన్నా, కేవలం రమ్ రుచిని రమ్‌కు, విస్కీ రుచిని విస్కీకి కృత్రిమంగా జోడించడాన్ని మాత్రం అధికారులు సహించలేకపోతున్నారు.

రుచి పేరుతో పెద్ద మోసం

అసలు రమ్ లేదా విస్కీ తయారీకి చాలా పెద్ద ప్రాసెస్ ఉంటుంది. మొలాసెస్ లేదా మాల్ట్ ఆధారంగా పులియబెట్టి, స్వేదన క్రియ జరిపి, సరైన కాలం పాటు బ్యారెళ్లలో నిల్వ చేస్తేనే వాటికి సహజమైన రుచి, వాసన వస్తాయి. కానీ చాలా మంది తయారీదారులు ఇవేమీ పట్టించుకోకుండా ఎక్స్ట్రా న్యూట్రల్ ఆల్కహాల్‌ను వాడుతున్నారు. దీనికి ఎలాంటి రుచి, వాసన ఉండవు. దీనిని ఆధారం చేసుకుని రసాయనాలతో తయారు చేసిన కృత్రిమ ఫ్లేవర్లను కలిపి అసలైన బ్రాండ్ల పేరుతో మార్కెట్లోకి వదులుతున్నారు.

అసలు రుచికి కృత్రిమ రంగులు

బండారం బయటపడడంతో అధికారులు వివిధ తయారీదారుల నుంచి నమూనాలను సేకరించి ల్యాబ్‌లకు పంపించారు. అక్కడ జరిగిన పరీక్షల్లో ఈ బ్రాండ్లు దారుణంగా విఫలమయ్యాయి. బయటి నుంచి కలిపిన కృత్రిమ ఫ్లేవర్లు సహజమైన రుచిని పూర్తిగా కప్పిపుచ్చుతున్నట్లు తేలింది. వీటిని సాధారణ రమ్ లేదా విస్కీ అని లేబుల్ వేసి అమ్మడం వినియోగదారులను మోసం చేయడమేనని తేల్చారు.

ఏళ్ల తరబడి పాత మోసం

సీసాలపై ఏళ్ల తరబడి పాతవి అంటూ తప్పుదారి పట్టించే పదాలు వాడటంపై కూడా కొరడా ఝుళిపించారు. పాత నిబంధనల ప్రకారం బ్లెండ్‌లో ఏ వయసు ఉందో దాని ప్రకారం లేబుల్ ఉండాలి కానీ పాతది లేదా సగటు చెప్పకూడదు. ఓల్డ్ మాంక్ ఎక్స్ఎక్స్ రమ్ వేరియంట్‌లో ఏడేళ్లుగా బ్లెండ్ చేసినట్లు రాశారు. కానీ అసలు లిక్విడ్‌లో మెచ్యూర్డ్ రమ్ ఐదు శాతానికంటే తక్కువగా ఉండి మిగతాదంతా న్యూట్రల్ స్పిరిట్ అని విచారణలో తేలింది. ఇలాంటి మోసపూరిత ఉత్పత్తులను ఇకపై సాధారణ పేర్లతో అమ్మడానికి వీలే లేదు. వాటిని రమ్ ఫ్లేవర్డ్ స్పిరిట్ లేదా విస్కీ ఫ్లేవర్డ్ స్పిరిట్ అనే స్పష్టంగా లేబుల్ చేయాలని ఆదేశించారు. లేబులింగ్ నిబంధనల ప్రకారం ప్రతి ప్యాకేజీ ముందు భాగంలో అసలు ఉత్పత్తి ఏమిటో కచ్చితంగా రాయాల్సిందే.

దిగ్గజ కంపెనీలపై చర్యలు

ఓల్డ్ మాంక్ ది లెజెండ్ రమ్, ఓల్డ్ మాంక్ గోల్డ్ రిజర్వ్ రమ్, ఓల్డ్ మాంక్ ఎక్స్ఎక్స్ మెచ్యూర్డ్ రమ్‌లపై వేటు పడింది. యునైటెడ్ స్పిరిట్స్ బారామతి యూనిట్ మెక్‌డవెల్స్ నెం.1 రమ్, ఐఎన్‌బీఆర్ఈడబ్ల్యూ బెవరేజెస్ బాప్‌పైపర్ డిలక్స్ విస్కీ, ఓల్డ్ క్యాస్క్ డిలక్స్ ఎక్స్ఎక్స్ రమ్, అసోసియేటెడ్ ఆల్కహాల్ సెంట్రల్ ప్రావిన్స్ విస్కీ, మెక్‌డవెల్స్ నెం.1 సెలబ్రేషన్ మెచ్యూర్డ్ ఎక్స్ఎక్స్ రమ్, యాంటిక్విటీ బ్లూ విస్కీ, రాయల్ ఛాలెంజ్ విస్కీలు ఈ జాబితాలో ఉన్నాయి. వీటన్నిటిపై చర్యలు తీసుకున్నారు.

ప్యారడైజ్‌లో జడల్ తిరుగుబాటు

ది ప్యారడైజ్ సినిమాలో నాని ఉగ్రరూపం

- శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో యాక్షన్ సీన్స్
- అనిరుధ్ సంగీతంతో చిత్రంపై భారీ అంచనాలు
- మోహన్ బాబు కీలక పాత్రతో సినిమాకు హైప్
- సెప్టెంబర్ 24న విడుదల



సినిమా తెరపై హీరోల మాస్ మేకోవర్లు ఎప్పుడూ సంచలనం సృష్టిస్తాయి. ఇప్పుడు అదే కోవలో టాలీవుడ్ బాక్సాఫీస్ ను గడగడలాడించడానికి మరో భారీ యాక్షన్ డ్రామా సిద్ధమైంది. దసరా వంటి బ్లాక్ బస్టర్ తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్ మరోసారి వస్తుండటంతో ప్రేక్షకుల్లో పూనకాలు తెప్పించే అంచనాలు నెలకొన్నాయి.

- సహనం వందే, హైదరాబాద్

తెలుగు సినిమా పరిశ్రమలో ఇప్పుడు ఎక్కడ చూసినా ది ప్యారడైజ్ సినిమా గురించే జోరుగా చర్చ జరుగుతోంది. టాలెంటెడ్ హీరో నాని నటిస్తున్న ఈ తాజా చిత్రానికి గతంలో బ్లాక్ బస్టర్ ఇచ్చిన దర్శకుడు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తుండగా నిర్మాత సుధాకర్ చెరుకూరి ఈ భారీ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ఈ కాంబినేషన్ అనౌన్స్ చేసినప్పటి నుంచే టాలీవుడ్‌లో అంచనాలు తారాస్థాయికి చేరాయి. ఈ భారీ యాక్షన్ డ్రామాను సెప్టెంబర్ 24 తేదీన థియేటర్లలో విడుదల చేయబోతున్నారు. తెలుగుతో పాటు ఇతర ప్రధాన భాషల్లో కూడా ఈ చిత్రం ఒకేసారి ప్రేక్షకుల ముందుకు రానుంది.

రగ్డ్ అవతార్‌లో జడల్

రీసెంట్‌గా విడుదలైన ఈ సినిమా టీజర్ సోషల్ మీడియాను షేక్ చేసేస్తోంది. టీజర్ చూస్తుంటేనే ఇది మామూలు సినిమా కాదని ఒక రేంజ్ యాక్షన్ డ్రామా అని స్పష్టంగా అర్థమవుతోంది. దసరా సినిమాలో తెలంగాణ బొగ్గు గనుల నేపథ్యంలో నానిని ఒక రగ్డ్ అండ్ రా అండ్ రస్టిక్ అవతార్‌లో చూశాము. కానీ ఈసారి ది ప్యారడైజ్ చిత్రంలో నానిని అంతకంటే చాలా ఫీర్స్‌గా అత్యంత శక్తివంతమైన రూపంలో చూపించబోతున్నారు. ఈ చిత్రంలో నాని పాత్ర పేరు జడల్ అని టీజర్ ద్వారా మేకర్స్ అధికారికంగా వెల్లడించారు.

భూమి కోసం భీకర పోరాటం

ఈ చిత్ర కథాంశం కేవలం సాధారణ కమర్షియల్ హంగులకే పరిమితం కాకుండా ఒక బలమైన సామాజిక అంశాన్ని స్పృశించబోతోంది. సమాజంలో జరిగే అణచివేతకు వ్యతిరేకంగా తమ గుర్తింపును కాపాడుకోవడం కోసం అలాగే భూమి కోసం సాగే ఒక భీకరమైన పోరాటమే ఈ సినిమా ప్రధాన కథ. జడల్ పాత్ర ద్వారా నాని చేసే రిబెలియన్ లేదా తిరుగుబాటు ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పించడం ఖాయం.

భారీ తారాగణం హవా

ఈ చిత్రంలో నానితో పాటు టాలీవుడ్ లెజెండరీ నటుడు మోహన్ బాబు ఒక అత్యంత కీలకమైన పాత్రలో నటిస్తున్నారు. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ సినిమా స్థాయిని మరో మెట్టు ఎక్కిస్తుందదంలో ఎలాంటి సందేహం లేదు. అలాగే విలన్ పాత్రలో రాఘవ్ జుయల్ నటిస్తుండగా ఆయన లుక్స్, నటన చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఇక కథానాయికగా కయాదు లోహర్ నటిస్తుంది. ఈ నటీనటుల కలయిక సినిమాపై అంచనాలను విపరీతంగా పెంచేసింది.

సెన్సేషనల్ మ్యూజిక్ మ్యాజిక్

సినిమా విజయానికి సంగీతం ఎంత ముఖ్యమో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ సినిమాకు సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. అనిరుధ్ ఇస్తున్న బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌కే ప్రాణం పోసిందని చెప్పవచ్చు. థియేటర్లలో ఈ సినిమా చూస్తున్నప్పుడు అనిరుధ్ బీజీఎం ప్రేక్షకులను సీట్లలో కూర్చోనివ్వకుండా ఉర్రూతలూగిస్తుందనే చెప్పాలి. టెక్నికల్ పరంగా కూడా ఈ సినిమా టాప్ నాచ్‌లో ఉండబోతోంది. సినిమాటోగ్రాఫర్‌గా సి. సై పని చేస్తుండగా ప్రొడక్షన్ డిజైనర్‌గా అవినాష్ కొల్ల వ్యవహరిస్తున్నారు.

దక్షిణాది సీట్లపై డీఎంకే కండీషన్లు

మూడు షరతులు విధించిన ద్రవిడ పార్టీ

- ప్రస్తుత పరిస్థితిని 25 ఏళ్లు పొడిగింపుకు పట్టు
- లేదా అన్ని పార్లమెంట్ స్థానాలు 50% పెంచాలి
- డీలిమిటేషన్ బిల్లుకు వ్యూహాత్మక అడుగులు
- ఎలాగైనా బిల్లు ఆమోదానికి కేంద్రం కసరత్తు
- సౌత్ పై వేలాడుతున్న డీలిమిటేషన్ కత్తి
- నోరు మెదపని అనేక దక్షిణాది పార్టీలు



దేశ రాజధాని ఢిల్లీలో సరికొత్త రాజకీయ తుఫాను చెలరేగుతోంది. నియోజకవర్గాల పునర్విభజన బిల్లును ఆమోదించుకునేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం పావులు కదుపుతుంటే, డీఎంకే పార్టీ మాత్రం గట్టి షరతులు విధిస్తోంది. దక్షిణాది వాటా పడిపోకుండా ఉండాలని, యాభై శాతం సీట్ల పెంపును అమల్లోకి తెస్తూ మరో పాతికేళ్ల పాటు ఫ్రీజ్ కొనసాగించాలని ఆ పార్టీ డిమాండ్ చేస్తోంది.

- సహనం వందే, చెన్నై

నరేంద్ర మోడీ ప్రభుత్వం తాజా పునర్విభజన ప్రక్రియ కోసం రాజ్యాంగ సవరణ బిల్లును తెచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ తరుణంలో డీఎంకే ఈ బిల్లుకు మద్దతు ఇవ్వడానికి మూడు ప్రధాన షరతులను తెరపైకి తెచ్చింది. రాజ్యాంగంలోని 1971 నాటి సవరణ ఆధారంగా ఉన్న ఫ్రీజ్ గడువు 2027 నాటి జనాభా లెక్కల తర్వాత ముగియనుంది. ఈ ఫ్రీజ్‌ను మరో 25 ఏళ్ల పాటు పొడిగించాలని ఆ పార్టీ కోరుతోంది. అలాగే అన్ని రాష్ట్రాల లోక్‌సభ స్థానాలను 50 శాతం మేర పెంచాలని డిమాండ్ చేస్తోంది. గతంలో పార్లమెంట్‌లో హోం మంత్రి అమిత్ షా దీనిపై స్పష్టమైన హామీ ఇచ్చారని ఆ పార్టీ గుర్తు చేస్తోంది.

పార్లమెంట్‌లో మారుతున్న సంఖ్యాబలం...

ప్రస్తుత పార్లమెంట్‌లో ప్రభుత్వానికి పూర్తి స్థాయి మెజారిటీ లేకపోయినా రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఏప్రిల్ 17న రాజ్యాంగ 110వ సవరణ బిల్లు వీగిపోయినప్పటి పరిస్థితులు ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. ప్రస్తుత 540 మంది సభ్యుల లోక్‌సభలో మూడింట రెండు వంతుల మెజారిటీకి 360 సీట్లు అవసరం కాగా, 22 మంది డీఎంకే సభ్యులు మద్దతిస్తే ప్రభుత్వ బలం 346కి చేరుతుంది. ఇక కొన్ని పార్టీల మద్దతుతో ప్రభుత్వం మెజారిటీ దిశగా దూసుకెళ్తోంది.

మద్దతు కోసం అధికార కూటమి కసరత్తు

ప్రభుత్వం తన బలాన్ని నిరూపించుకునేందుకు మిత్రపక్షాల మద్దతును కూడగట్టుకుంటోంది. తృణమూల్ కాంగ్రెస్ నుంచి వేరుపడిన 20 మంది ఎంపీలు నేషనల్ సిటిజెన్స్ పార్టీ ఆఫ్ ఇండియాలో చేరగా, శివసేనలో ఆరుగురు ఎంపీలు ఏక్‌నాథ్ షిండే వర్గానికి మద్దతుగా నిలిచారు. ప్రధాని నరేంద్ర మోడీ స్వయంగా ఈ ఎంపీలతో అల్పాహార భేటీ ఏర్పాటు చేయడం విశేషం. మరోవైపు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో భేటీ అయి మద్దతు కోరారు. కాగా వచ్చే వారం రాబోయే బిల్లులను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. త్రీ లైన్ విప్ జారీ చేసి తమ సభ్యులందరూ పార్లమెంట్‌లో విధిగా ఉండాలని ఆదేశించింది.

డీఎంకే తుది నిర్ణయంపై ఉత్కంఠ

డీఎంకే పార్టీ అధికారికంగా మాత్రం బిల్లు పూర్తి పాఠం చేతికి వచ్చిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేస్తోంది. ఏ రాష్ట్రానికి ఎన్ని సీట్లు వస్తాయనే పూర్తి షెడ్యూల్ తమకు కావాలని ఆ పార్టీ డిమాండ్ చేస్తోంది. మహిళా రిజర్వేషన్ల అమలు కోసం లోక్‌సభ స్థానాలను 850కి పెంచేందుకు ప్రభుత్వం తెస్తున్న ఈ బిల్లుపై దేశవ్యాప్తంగా తీవ్ర చర్చ నడుస్తోంది.

అయితే, సంఖ్యాబలం కొరత ఉన్నప్పటికీ గైర్హాజరు లేదా ఇతరత్రా వ్యూహాల ద్వారా నెగ్గుకురావాలని కేంద్రం చూస్తోంది. డీఎంకే షరతులకు కేంద్రం ఎలా స్పందిస్తుందనేది రాబోయే రోజుల్లో తేలనుంది. ఇది ఇలా ఉంటే దక్షిణాదిలో ఉన్న అనేక ప్రాంతీయ పార్టీలు డీలిమిటేషన్ విషయంలో నోరు మెదపకపోవడం దారుణం.